విడిచిపెట్టాడు జగన్నాథం.

తిరిగి ఏదో సంభాషణ కొనసాగించబోయింది సుబ్బులు.

పక్కన నవ్వాడు జగన్నాథం నవ్వి, కోపం నటిస్తూ అన్నాడు.

"ఊఁ బొత్తిగా భయంలేకుండా పోయింది. పరీక్షల ముందు చదువుకోవాలన్న శ్రద్ధలేకుండా. త్వరగా వెళ్ళు" అని.

"అసలీసారి నేనొస్తే అప్పుడడుగు" అంది.

ఇద్దరూనవ్వుకున్నారు. లేచిడుఁళ్ళోకినడిచారు.

పిల్లిలా అడుగులేసుకుంటూ మంచం దగ్గరకి నడుస్తున్న జగన్నాథాన్ని "ఎక్కడికెళ్ళి వస్తున్నావురా" ప్రశ్నించిందిమంచంపైపడుకున్న బుచ్చమ్మ.

ఇంటికప్పు అమాంతంమీద పడినట్టయి "అమ్మా మంచినీళ్ళ"న్నాడు తిరిగి.

నవ్వుతూలేచి, మంచినీళ్ళు తెచ్చిచ్చి "ఏంరా జగన్నాథం నాతోకూడా చెప్పకుండా అంతగా దాచిపెట్టుకున్నావ్ నేనంతా గ్రహించాలే. సుబ్బుల్ని ఇంటివఱకు జాగ్రత్తగా దిగవిడిచి వచ్చావా రాత్రిపూటకూడాను. మాఘమాసంలో మంచి ముహూర్తాలున్నాయ్ ఏమంటావ్" అంది బుచ్చమ్మ.

మొదట సిగ్గుపడి తరువాత ఈసారి "ఊఁ" అన్నాడు జగన్నాథం.

సెక్చ్

# సినిమాలో అతను

లక్ష్మీప్రసాద్

"ఏంవేఁ రమణీ! సినిమాచూస్తే ఇల్లంతా స్టూడియో అయిపోయేది, మా అందరికీ సినిమా చూడవలసిన పనే వుండేదేకాదే! ఇవ్వాళింత నిశ్శబ్దంగా వున్నావేం?"

"అసలు మాకర్మమయితేగా!... తెలుగు పిక్చరయితే—. పోనీ పాట్లయినా లేవు మంచివి."

"కథయినా తెలిసిందా?"

"కథకేం, ఇదివరకు చదివిందేగా నవల. దానికేంగానోదినా, నిన్న భలే తమాషా అతన్ని చూశాంలే! నువ్వూ రావల్సింది."

"నీ మొహం!"

"ఇక్కడిక నలుగురుం బయల్దేరామా, సరస్వతి ఇంటికి వెళ్ళేసరికి చిన్నచిన్న చినుకులు ప్రారంభం అయినయ్యి. రిక్షాల్లో పోదామంటే, అయిదుగురం వున్నాం. మా కారులో పోదామంది గొప్పగా. సరే ఆ డొక్కుకారు స్టార్టయేప్పటికి బ్రహ్మాండమయింది—

"ఆ చివర కూర్చున్న రత్నమాల, ఈ చివర కూర్చున్న నేనూ సగం తడిసేము. చెమ్మచెమ్మగా చీకట్లో హాల్లోకి అడుగుపెట్టేము, పిక్చరు బిగినయింది. హౌస్‌ఫుల్ అయిందని మేనేజరు, పాపం మమ్మల్ని పదిహేనణాలకే ఫస్టుక్లాసులో కూర్చోబెట్టేడు! అప్పటికి మేం కూర్చున్న 'రో' అంతా ఖాళీయే. ఇంకో అయిదునిముషాలకి ఆ చివర రంగనాయకమ్మ ప్రక్కనొకడు, ఈ చివర రత్నమాల ప్రక్కనొకడు బాడీగార్డ్స్ సిద్ధమయ్యేరు. "ఒరే! భలే వెచ్చగా వుందిరా" అని ఒకడు, రత్నమాల ప్రక్కనున్నవాడు "ఇక్కడ చలిరా" అంటున్నాడు. రత్నమాల అసలే పిరికిది. నా చైర్లోకది, దాని చైర్లోకి నేనూ మారేము. అయినాను, ఫ్రూల్స్ ఒకటే గోల. ఇలాకాదని, అందరంలేచి ఓ చివరకి పోయేం.

"కొంత గొడవ వదిలింది అనుకుంటే, నెమ్మదిగా ఒక్కొక్క కుర్చీ నిండిపోయింది, పెద్దమనుష్యులు మూలాన్ని నా ప్రక్కసీటు ఖాళీగానే వుండిపోయింది, గౌరవంగానే కూర్చున్నారు. నాకుహిందీరాకపోయినా స్టోరీ తెల్సునుగా. ప్రక్కనున్న ఉష అడుగుతుంటే అదీ ఇదీచెప్తున్నాను.

"ఇంతలో ఎవరో హఠాత్తుగా, ఆయాసంతో వగర్చుకుంటూ వచ్చి నా ప్రక్కనున్న కుర్చీ దులుపుకుంటున్నాడు. పూర్తిగా ముద్దకూడా అయిపోయినట్టున్నాడు వానలో. నేను మామూలుగా చూసేనంతే అతని వంక. ఏమనుకున్నాడో ఏమో—

"క్షమించండి..." అంటూ కూర్చున్నాడు.

"ఫరవాలేదు-అందామనిపించింది కాని అనలేక పోయేను. అంత ఇవ్వాళే రాకపోతే ఏం మునిగిపోయిందో-ఇంకా మొదటిరోజేగా ఉషనోరు మూసేసేను. పాపం అతని పేమీ విని పించుకుంటున్నట్టు లేదు. పిక్చర్‌తో మునిగి పోయేడు. పాపం ఏదో గౌరవంగా చెప్పేడు మేం ఏఁవనుకుంటామో అని. నిజంగానే ఇంక సీట్లుకూడా కాళీలేవు. కదిపి కయ్యం తేవడం మరి ఉష. కాని మొదటిరోజూనేతనెందుకు బయల్దేరింది.

"మనిషి మామూలుగానే వున్నాడు కాని, మేనర్స్ మరోవిధంగా వున్నాయి. సిగరెట్లు తెగ కాలుస్తున్నాడు. సినీమాలో ప్రేయసిని ప్రేమిస్తున్నట్టు, ప్రియుణ్ణి ఎన్‌కరేజ్ చేస్తున్నట్టు అతని ముఖం రంగులు మారుతుంది. అప్పుడప్పుడు నవ్వుతుండేవాడు కాని చాలామంది నవ్వేటప్పుడు నవ్వుతుండేవాడు కాదు—మాలాగే. అంటే అతనికీ హిందీ రాదన్నమాట.

"ఉషకి, సరస్వతికి నేను కథ చెబుతుంటే, ఎప్పుడైనా ఓసారి మావంక చూసేవాడు. ప్రత్యేకం నన్నే వింతజంతువుని చూసినట్టు చూసేవాడు. చెప్పడం మానేద్దామంటే ఉషకి ఒక్కపిసరైనా అర్థంకాదు.

"అతనిలా సిగరెట్లు కాల్చడం, మావంక చూడ్డం ఉషకి కోపం తెప్పించింది—కాబోలు. 'ఛీ! వెధవసిగరెట్ పొగ, ఊపిరాడనివ్వకుండాను' అంది గట్టిగానే.

"అతని చేతిలో సిగరెట్టు మాయమయింది నాకు జాలేసింది అతని త్యాగానికి. ఇంటర్‌వెల్‌కి అతనూ బయటికి వెళ్ళలేదు. ట్రాజిడీయా, కామిడీయా, అంటే నవలకామిడీయే మరి ఎలా ముగిస్తాడో పిక్చరు అన్నాను ఉషతోటి వాళ్ళ నలుగురూ బయటికి వెళ్ళేరు. నేనొక్కర్తినీ కూర్చుని ఇంటర్‌వెల్‌కి హాల్లో వేసే రికార్డులు వింటున్నాను. అతను నావంక చూస్తున్నాడని నేనూ అతన్ని చూసేను. అతను చూస్తూనే పరిచయం వున్నట్టు నవ్వుతూనే—'మీరు నవల చదివేరా?' అన్నాడు.

"చదివేనండి" అన్నాను.

"ఓ! అదే మీతో వచ్చిన చిక్కు! అని, బయటికి వెళ్ళేడు. నాకు ఒళ్ళు చచ్చిపోయింది. ఒళ్ళు మండిపోయింది."

"లేకపోతే సినిమా చూస్తూ మధ్యలో మీ చర్చలేఁవిటి!"

"నన్నేం చేయమంటావ్ ఉషపక్కన కూర్చుని చంపుకు తింటూంటేను. అందుకనే తరువాత ఉష అడిగినా నేనింక ఏఁవీ మాట్లాడలేదు, అతనూ సిగరెట్లు కాల్చలేదు. మా మాట్లాడక పోవడం, అతన్ని మా వంక రెండు మూడు సార్లు చూసేటట్టు చేసింది — ఓ అరగంటయింది. సరిగ్గా ప్రేయసీ ప్రియులు విడిపోతున్న ఘట్టం అది. ప్రేయసి హృదయార్పణ చేసేసేక కన్నీరు కారుస్తూ కదిలిపోతున్న బండిలో సజీవంగా కూర్చుంది-కదల్లేని మేడమీద, అపార్థం జేసుకున్న ప్రియుడు నిర్జీవిగా నిల్చున్నాడు. నాకళ్ళకి ఏదో మెరిసినట్టయితే ప్రక్కన తను సిగరెట్ ఏమోనని చూసేను. ఒళ్లు నీరయిపోయింది. ప్రక్కన తను కారుస్తున్న కన్నీటి చారికల్లో ప్రేయసీప్రియుల యెడబాటు స్పష్టమయింది. నిజంగా అంత విషాదమైన సమయంలోకూడా మేం కన్నీరు కార్చలేకపోయేమే! కనీసం బాధయినా పడలేదు—నా ప్రక్కనున్న నాలుగు కన్నె మనసులూ, రేపంటే-కాలేజీ ఫన్క్షన్‌కి అయిదుగ్గురుం ఒకేరంగు బ్లౌజు ఒకేరంగు జార్జెట్ సారీసు కట్టుకు వెళ్ళాలని గుసగుసమంటున్నారు—వెధవ పిక్చర్ ఇంకేం చూస్తామని రోతగా...

"నేను సినిమాచూడ్డం మానేసి అతన్నేచూస్తూ కూర్చున్నాను. ఎంత సుకుమార హృదయమో అనుకుంటూ..."

"ఒదార్చవలసిందే పాపం-పొరపాటుచేసేవు!!"

"అయినా ఫరవాలేదు. చాలా మంచెత్నా వున్నాడు. ఎవర్నయినా ప్రేమించేడు కాబోలు. లేకపోతే అలా బాధ పడడు. ప్రేమించగలిగిన వాళ్ళ హృదయమే అలా ఏడుస్తుంది!"

"పాపం! ఏ కూతురో జ్ఞాపకం వచ్చిందేమో!"

"ఛీ! చిన్నతనేనే స్టూడెంట్‌లాగే వున్నాడు."

"ఊఁహూఁ! అదా అయితే ప్రేమచిక్కుల్లో పడ్డావన్నమాటే—"

"నేనా? ప్రేమించానా? ఆయనెవరో!" ★